క్లుప్తంగా

అదాలత్‌లో 436 కేసులు పరిష్కారం: జడ్జి ధనలక్ష్మి

జోగిపేట(అందోల్): జోగిపేటలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 436 కేసులు పరిష్కరించినట్లు జోగిపేట జూనియర్ సివిల్ జడ్జి ధనలక్ష్మి తెలిపారు. శనివారం జోగిపేటలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఆమె మాట్లాడుతూ పరస్పర అంగీకారంతో కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి వేదిక అన్నారు. రాజీ మార్గం రాజ మార్గమన్నారు. కార్యక్రమంలో ఏజీపీ హరినారాయణవర్మ, సీనియర్ న్యాయవాదులు నారాయణ రెడ్డి, కృష్ణారెడ్డి, పీజే విఠల్‌రెడ్డి, న్యాయవాదులు అల్లె శ్రీకాంత్, మల్లేశం, కోర్టు సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మృతి

హత్నూర(సంగారెడ్డి): చేపల పట్టేందుకు వెళ్లి నీటి కుంటలో పడిన వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన హత్నూరలో శనివారం ఆలస్యంగా చోటుచేసుకుంది. ఎస్‌ఐ సుభాష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పొట్లగల్లా ప్రశాంత్ (23), కాసాల సుందరయ్య ఇద్దరు శుక్రవారం సాయంత్రం శివారులోని నడిమిచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. ప్రశాంత్ ప్రమాదవశాత్తు చెరువులో పడి రక్తం వాంతులు చేసుకున్నాడు. వెంటనే అతడిని సుందరయ్య స్థానికుల సహాయంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఇక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి సోమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

పద్మనాభుని ఆశీస్సులు ఉండాలి

పటాన్‌చెరు: అనంత పద్మనాభస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో శనివారం నిర్వహించిన లక్ష్మీ అనంత పద్మ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నీలాన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పట్లోళ్ల రవీందర్‌రెడ్డి, ఒగ్గు కొమరయ్య, అమరేందర్ రెడ్డి, అమృత రెడ్డి, బాలకృష్ణ, కృష్ణ, రాజు, గోపాల్, సత్తి, శ్రీనివాస్, వెంకటేశ్, మహిపాల్, ఉత్సవ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'గణేష్ గడ్డ' హుండీ లెక్కింపు

పటాన్‌చెరు టౌన్: రుద్రారం పంచాయతీ పరిధిలోని గణేష్ గడ్డ దేవస్థానంలో హుండీని శనివారం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ సమక్షంలో లెక్కించారు. 60 రోజులకు గాను రూ.15.41 లక్షలు, అదేవిధంగా అన్నదానం ద్వారా ఆదాయం రూ. 80 వేలు వచ్చినట్లు ఈఓ మోహన్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్ రెడ్డి, ఈశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుండీలో వచ్చిన ఆదాయాన్ని దేవాలయం అభివృద్ధికి ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను సమకూర్చనున్నట్లు పేర్కొన్నారు. అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్, అయ్యప్ప, సతీష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను తగ్గించాలని వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులు తగ్గించాలని విద్యుత్‌నగర్ కాలనీకు చెందిన యువకులు కోరారు. శనివారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సుమేష్, సతీష్, వెంకట్ మాట్లాడుతూ మున్సిపాలిటీ ఏర్పడిన తరువాత ఇష్టానుసారంగా ఇంటి పన్నులు విధిస్తున్నారని వివరించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఇంటి పన్నులకు తమకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఇప్పటికైనా ఆస్తి పన్ను తగ్గించాలని కోరారు. నరేందర్ రెడ్డి, నాగరాజు, ఉమేష్‌లు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని భారతీయ విద్యాభవన్ పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు సముద్రాల వేణువర్ధన్ రచించిన అపరిచిత గద్య కారదీపిక పుస్తకాన్ని శనివారం ఆపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాశాస్త్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు పుస్తకాన్ని రచించడం ఆనందంగా ఉందన్నారు. ఇందులో అనేక అద్భుతమైన నైతిక, విజ్ఞాన అంశాలతో పాటు ఎందరో మహనీయుల జీవిత విశేషాలున్నాయని తెలిపారు. అనంతరం పుస్తక రచయిత వేణువర్ధన్‌ను సన్మానించారు.

కోడ్ ఎఫెక్ట్..



ఫ్లెక్సీని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన రాజకీయ నేతల ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు శనివారం సాయంత్రం తొలగించారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం..ఆపై కోడ్ అమలులోకి రావడం జరిగింది.

బీఆర్ఎస్ నిరసనలు

సంగారెడ్డి/నారాయణఖేడ్: భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసిస్తూ శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, పార్టీ నేతలు రాజీవ్‌చౌక్‌లో ధర్నా నిర్వహించారు. మోదీ ప్రభుత్వం ఐటీ, ఈడీ, సీబీఐలతో ప్రతిపక్షాలను అణిచివేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కవిత అరెస్టును తీవ్రంగా ఖండించారు. సిర్గాపూర్ జెడ్పీటీసీ రాఘవరెడ్డి, ఎంపీటీసీ భూపాల్, ముఖ్యనాయకులు అభిషేక్ షెట్కార్, అరుణ్ రాజ్, నవాబ్, ఉబేద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సంగారెడ్డిలో.. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి.



సంగారెడ్డిలో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, పార్టీ శ్రేణులు



నారాయణఖేడ్‌లో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తదితరులు

రైతులకు ప్రోత్సాహం

- ఉపాధి పథకం ద్వారా ఎంపిక చేసిన మొక్కలు నాటాలి
- మూడేళ్ల వరకు సంరక్షణ ఖర్చులు
- నేరుగా రైతుకే చెల్లింపులు

కంది(సంగారెడ్డి): జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు వ్యవసాయంతో పాటు మొక్కలు నాటుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోంది. అయితే ఎంపిక చేసిన మొక్కలను నాటాల్సి ఉంటుంది. వాటికి అయ్యే ఖర్చును నేరుగా రైతులు పొందవచ్చని ఉపాధి హామీ పథకం అధికారులు చెబుతున్నారు. తవ్విన గుంతల ఖర్చుతో సహా మొక్కల రవాణా ఖర్చు.. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చెల్లిస్తారు. ఆసక్తి ఉన్న చిన్న,సన్నకారు రైతులు ఉపాధి హామీ అధికారులను సంప్రదించి లబ్ధిపొందవచ్చు. ప్లాంటేషన్ చేసుకునే రైతుల ఎంపిక కోసం ఇప్పటికే మార్గదర్శకాలు వెలువడినట్లు చెబుతున్నారు. నేరుగా లబ్ధి కలిగించేందుకు ప్రతి ఏడాది ఈజీఎస్‌లో మార్పులు చేస్తూ వస్తున్నారు. ఒక్కొక్కరికి ఎకరానికి 445 మొక్కల చొప్పునా రెండెకరాలకు 890 మొక్కల చొప్పునా సరఫరా చేస్తున్నారు. ఒక్కో మొక్కకు మూడేళ్ల పాటు నిర్వహణ, సంరక్షణ నిమిత్తం ఖర్చులు చెల్లిస్తారు.

కలప మొక్కలు

కలప మొక్కలైన టేకు, నిలగిరి ఎకరానికి వెయ్యి, రెండెకరాలకు రెండు వేల చొప్పున మొక్కలను సరఫరా చేస్తారు. బతికిన ప్రతి మొక్కకు సంరక్షణ నిమిత్తం మూడున్నర రూపాయల చొప్పున ఏడాదికి రూ. 36 వేలకు మించకుండా అందజేస్తారు. రెండెకరాల్లో నాటిన రెండు వేల మొక్కలను బతికిస్తే రూ.74 వేలు ఇస్తారు.


పండ్ల మొక్కలు

పండ్ల మొక్కలైన మామిడి, జామ, అల్లనేరేడు, బత్తాయి, సపోట, దానిమ్మతో పాటు వివిధ రకాల మొక్కలను నాటుకోవచ్చు. ఒక్కో మొక్కకు రూ.11-10ల చొప్పున అందజేస్తారు. ఈ ఖర్చును మొక్కల సంరక్షణ కోసం నేరుగా రైతులకు అందజేస్తారని అధికారులు చెబుతున్నారు.



వననర్సరీలో పెంచుతున్న మొక్కలు

సద్వినియోగం చేసుకోవాలి
శ్రీనివాస్, ఎంపీడీఓ



చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయంతో పాటు మొక్కలు పెంచుకొని అదనంగా లాభం పొందేందుకు ప్రత్యేక పథకం రూపొందించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పొలాల వద్ద నాటుకునే మొక్కల సంరక్షణ, నిర్వహణ కోసం ప్రభుత్వం డబ్బులు చెలిస్తుంది. రైతులు అధికారులను సంప్రదించి మొక్కలు నాటి ప్రయోజనం పొందవచ్చు. రైతులందరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలి.

మత్తుపదార్థాలకు బానిసలు కావొద్దు

సంగారెడ్డి అర్బన్: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు అతిమేల మాణిక్యం అన్నారు. భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా ఎల్లంకి డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ మత్తు పదార్థాల నివారణపై అవగాహన సదస్సు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసై చెడు బాట పడుతున్నారన్నారు. డ్రగ్స్ మాఫియా విపరీతంగా పెరిగిపోవడానికి కారణం పాలకులేనని నిందించారు. యూనివర్సిటీ, విద్యా సంస్థల ప్రాంగణంలో గంజాయి, మత్తుపదార్థాలు లభిస్తుండటం వల్ల కొందరు యువకులు, విద్యార్థులు బానిసలుగా మారుతున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు.

వారు తమ వద్ద డబ్బులు లేని సమయంలో దొంగతనాలు, హత్యలకు పాల్పడుతున్నారన్నారు. చివరకు తమకు తామే ఆత్మహత్య చేసుకుంటున్న పరిస్థితులున్నాయన్నారు. అలాగే చిన్నపిల్లల కిడ్నాపర్స్‌గా మారుతున్న పరిస్థితి జిల్లాలో ఉందన్నారు. యువత మంచి మార్గంలో వెళ్లేలా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంగం జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్, రవికిరణ్ గౌడ్, వాణి, కార్తీక్ విద్యార్థులు ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేష్ నాయక్ కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం రుద్రారం శ్మశాన వాటిక సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి(40) మృతదేహం శనివారం కనిపించింది. రుద్రారం కారోబార్ రాజు ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కనులపండువగా రాచన్నస్వామివారి కల్యాణం



భద్రకాళి సమేత శ్రీరాచన్న స్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో భక్తులు

కోహీర్(జహీరాబాద్): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బడంపేట రాచన్నస్వామి జాతర ఉత్సవాల మూడో రోజైన శనివారం భద్రకాళి దేవి సమేత స్వామివారి కల్యాణం కనులపండువగా జరిగింది. వేద పండితులు చెన్న వీరయ్య స్వామి, జగదీశ్వర్ క్రతువును జరిపించారు. అనంతరం అశ్వవాహనోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి స్వామి వారి రథోత్సవ కార్యక్రమం బాజాభజంత్రీల మధ్య వైభవంగా జరిగింది. రథోత్సవం, ఆలయ ప్రదక్షిణ అనంతరం అగ్నిగుండం ముగింపుతో ఉత్సవాలు పూర్తయ్యాయి. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, కోహీర్, బీఆర్ఎస్ జహీరాబాద్ మండల అధ్యక్షుడు నర్సింహులు యాదవ్, తట్టు నారాయణ, న్యాల్‌కల్ జెడ్పీటీసీ స్వప్న భాస్కర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఎంపీ పాటిల్ పర్యటన

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండలం మోర్గి, షాపూర్, కారముంగి, నాగల్‌గిద్ద గ్రామాల్లో ఎంపీ బీబీ పాటిల్ శనివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో వివిధ పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి జనవాడె సంగప్ప, మారుతిరెడ్డి, రామకృష్ణా తదితరులు పాల్గొన్నారు.

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పుల్‌కల్(అందోల్) : మండల పరిధిలోని గొంగ్లూర్ తండాలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంచంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సురేందర్ పాల్గొన్నారు.

◆ పోషకాహారంతోనే ఆరోగ్యం

సంగారెడ్డి టౌన్: చిన్నారులతో పాటు ప్రతి ఒక్కరూ పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సౌమ్య సూచించారు. శనివారం మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో విడత పోషణ్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పరిశుభ్రత, పోషక ఆహారం, సమతుల్య ఆహారం, రక్తహీనత, డయేరియాను నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అభియాన్ జిల్లా సహాయ సమన్వయకర్త నవీన్ కుమార్, పాఠశాల సిబ్బంది అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులు మంచిగా చదువుకోవాలి

ఝరాసంగం(జహీరాబాద్): విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్, జహీరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, నియోజకవర్గ అధ్యక్షుడు నరేష్ గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు రాంచందర్ భీమ్ వంశీ, వెంకట్ రెడ్డి, రమేష్ గౌడ్, సుదర్శన్, యువజన కాంగ్రెస్ విభాగం నాయకులు నవాజ్ రెడ్డి, అన్వార్, శ్రీకాంత్ రెడ్డి, మున్నా, శ్రీనివాస్ రెడ్డి, సంగమేశ్వర్, దత్తు, ఇబ్రాహిమ్, చరణ్ సింగ్, తుకారాం, మన్నె రామ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

◆ నోటిఫికేషన్

పటాన్‌చెరు టౌన్: మండలంలోని రుద్రారం.. గణేష్ దేవస్థానానికి నూతన ధర్మకర్తల కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ అయ్యిందని ఆలయ ఈఓ పీ మోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. సభ్యులుగా చేరాలనుకునే వారు జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో 20 రోజులలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దేశానికి పల్లెలే పట్టుకొమ్మలు

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: దేశానికి పట్టుకొమ్మలైన పల్లెల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని మిత్యానాయక్ తండా, తుర్కపల్లి తండా, వెంకటాపూర్‌లో ఒక్కో చోట రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో మాట్లాడుతూ మౌలిక సదుపాయాలతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అందువల్లే గ్రామాలు, తండాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహెర్‌అలీ, బంజారా సేవాలాల్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, మాజీ ఎంపీటీసీలు పండరిరెడ్డి, దత్తుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపూర్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కక్ష సాధింపు ధోరణి సరికాదు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రతిపక్ష పార్టీ నేతలపై కక్ష సాధింపు ప్రభుత్వానికి తగదని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాదారంలో ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. శనివారం ఆయన వాటిని పరిశీలించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో పాటు ఇళ్లు కూలిపోయిన నిరుపేదలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. నిరుపేదలు నిర్మించుకున్న ఇళ్లను అధికారులు కూల్చివేయటం సరైంది కాదన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇలాంటి చర్యలకు ప్రభుత్వం పాల్పడటం సరికాదన్నారు. ఇలాంటి కక్ష సాధింపు ధోరణికి వ్యతిరేకంగా పోరాడుదామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ నాయకులు పాల్గొన్నారు.



కూల్చి వేసిన నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పౌష్టికాహారంతో ఆరోగ్యం

సీడీపీఓ చంద్రకళ

పటాన్‌చెరు టౌన్: పౌష్టికాహార లోపం రాకుండా... చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవాలని పటాన్‌చెరు ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ అన్నారు. శనివారం పటాన్‌చెరు ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ్ వారోత్సవాల్లో భాగంగా పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3-5 సంవత్సరాల లోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. చిన్నారులకు, ప్రీస్కూల్ బుక్స్, ప్రొఫైల్స్, అభివృద్ధి చార్ట్, పిల్లల పర్యవేక్షణ కార్డు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. శిశువు పుట్టిన వెంటనే మురుపాలు పట్టిస్తే పోషకాలు అందుతాయన్నారు. 6 నెలల వరకు తల్లిపాలే పట్టించాలని సూచించారు. ఆరు నెలలు దాటిన వెంటనే తల్లిపాలతో పాటు బాలామృతం తదితర పోషకాలు అందిస్తే దృఢంగా తయారవుతారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మానెమ్మ, అంగన్‌వాడీ టీచర్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న చంద్రకళ

తాగునీటి సమస్యలు రావొద్దు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలో తాగు నీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ ఉపాధ్యక్షుడు గౌసోద్దీన్ అధికారులను కోరారు. శనివారం ఎంపీపీ అధ్యక్షురాలు అంజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ సాబేర్ హుస్సేన్ మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా కొన్ని గ్రామాల్లో తాగు నీటి సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు. ఎస్‌డీఎఫ్ కింద రూ.21లక్షల అంచనాతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. కరెంట్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని వైఎస్ఎంపీపీ కోరారు. న్యాల్‌కల్-బీదర్ రోడ్డు బాగైనప్పటికీ నారాయణఖేడ్ డిపోకు చెందిన బస్సులు నడపడం లేదన్నారు. బీదర్ వెళ్లే ప్రయాణికులు అధిక రేటు చెల్లించి ప్రైవేటు వాహనాల్లో వెళ్తున్నారన్నారు. ఈ విషయమై నారాయణఖేడ్ మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడేందుకు ప్రయత్నిస్తే స్పందించ లేదన్నారు. జీరో విద్యుత్ బిల్లులు రాని వినియోగదారులు స్థానిక ఎంపీపీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని విద్యుత్ శాఖ ఏఈ అర్జున్ తెలిపారు. ఆయా శాఖల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ఇబ్బందులు రాకుండా చూడాలని ఎంపీడీఓ సురేష్ అన్నారు. సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరు కాలేదు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఈ సాబేర్ హుస్సేన్

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

నారాయణఖేడ్: పట్టణంలోని ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. స్థానిక పొట్టి శ్రీరాములు చౌక్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మాణిక్ ప్రభు మాట్లాడుతూ నాడు ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రం కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన మహనీయుడని గుర్తు చేసుకున్నారు. సంఘ స్థానిక బాధ్యులు కృష్ణమూర్తి, వీరేశలింగం, నర్సింహులు, అశోక్, భూషణం, వీరన్న, సంగమేశ్వర్, రాజు, సంతోష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

చల్లబడిన వాతావరణం





సంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలతో కూడిన వర్షం కురిసింది. భగభగ మండుతున్న ఎండ నుంచి ప్రజలు తాత్కాలిక ఉపశమనం పొందారు. అంతకు ముందు రోజంతా ఆకాశం మేఘావృతమైంది. ఆపై ఉక్కపోతకు దారితీసింది. అనంతరం సుమారు గంట పాటు వర్షం కురిసింది.

– సాక్షి నెట్‌వర్క్